క్లుప్తంగా

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



బాన్సువాడ: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని లంబాడి స్టూడెంట్ ఆర్గనైజేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శనివారం బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు రాథోడ్ జీవన్ మాట్లాడుతూ.. గత నాలుగేళ్లుగా డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులకు బకాయిపడ్డా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. నాయకులు వికాస్ నాయక్, గబ్బర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

ప్రమాణస్వీకారోత్సవం



భిక్కనూరు: మండలంలోని కాచాపూర్ గ్రామంలోని వీరేశ్వరాలయం నూతన పాలక మండలి సభ్యులు శనివారం ప్రమాణస్వీకారం చేశారు. చైర్మన్‌గా ఆకుతోట స్వామి ఉపాధ్యక్షుడిగా తోగరి శ్రీనివాస్, డైరెక్టర్లుగా మంగపల్లి రమేష్, ఉడుము బాలమణిలతో ఈవో శ్రీధర్ ప్రమాణస్వీకారం చేయించారు.

హుండీ లెక్కింపు



భిక్కనూరు: మండలంలోని సిద్ధరామేశ్వరాలయం హుండీని శనివారం లెక్కించారు. ఆదాయం రూ.3లక్షల 35వేల 127 వచ్చినట్లు ఈవో శ్రీధర్ తెలిపారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ శ్రీరామ్ రవీందర్, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందే మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్ష



కామారెడ్డి టౌన్: పేదల సంక్షేమ కోసం ధర్మసమాజ్ పార్టీ చేపట్టిన నిరాహార దీక్ష శనివారం రెండో రోజు కొనసాగింది. మున్సిపల్ కార్యాలయం ముందు దీక్షలో నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ బలోశ్వర్ మాట్లాడుతూ.. ప్రజలకు ఉచితంగా విద్య, వైద్యం అందించాలన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగఅవకాశాలు, పేదలకు సాగు భూమి, ఇల్లు లేనివారికి ఇళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు అరవింద్, లక్ష్మణ్, రాజు, కవిన్, రాజు, రాజశేఖర్, సాయి, మురళి, మహేష్, పార్శిరాములు, ప్రభాకర్, శివరామకృష్ణ, సత్యం పాల్గొన్నారు.

రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

ఎల్లారెడ్డిరూరల్: జీపీలలో చేపట్టిన ఉపాధిహామీ పనులకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని అడిషనల్ డీఆర్‌డీవో వామన్‌రావు అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఆయన మండల ప్రత్యేక అధికారి, ఆర్డీవో మన్నె ప్రభాకర్ అధ్యక్షతన ఉపాధిహామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించారు. గ్రామాలలో చేసిన పనులకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులు సక్రమంగా రికార్డులు మెయింటెన్ చేయకపోవడం సరికాదన్నారు. చేసిన ప్రతి పనికి సంబంధించిన రికార్డులు ఉండాలని అన్నారు. ఎంపీడీవో ప్రకాష్, ఏపీవో వినోద్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతి కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

భిక్కనూరు: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం కాచాపూర్, పెద్దమల్లారెడ్డిలలో హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఐవీ, సుఖ వ్యాధులు వచ్చే మార్గాలు, జాగ్రత్తలను వివరించారు. ఆయా వ్యాధులపై సేవలు అందించే కేంద్రాల గురించి అవగాహన కల్పించారు. వైఆర్జీ కేర్ లింక్ వర్కర్ బాలకిషన్, ఆటో యూనియన్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

జోరందుకున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గా యత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ జోరందుకుంది. శుక్ర వారం నాటికి లక్షా 55వేల 102టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపా రు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పైప్‌లైన్ లీకేజీలు.. తాగునీరు కలుషితం



దుర్కిలో రహదారిపై పారుతున్న నీరు



దుర్కిలో రోడ్డుపై ఉన్న గుంతల్లో నిలిచిన నీరు



మైలారంలో..

- దుర్కి, మైలారం, నాచుపల్లిలో రోడ్లపై పారుతున్న నీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- మరమ్మతులు చేపట్టని అధికారులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి పైప్‌లైన్లు లీకేజీ కావడంతో ప్రజలకు కలుషిత నీరు పంపిణీ అవుతోంది. లీకేజీ నీరు రోడ్లపై పారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి.

నస్రుల్లాబాద్ మండలంలోని దుర్కి గ్రామంలోకి వెళ్లే ప్రధాన దారిపై నిత్యం పైపులైన్ లీకేజీ ద్వారా నీరు వృథా అవుతుంది. పైప్‌లైన్ వద్ద మురికికూపంలా మడుగు ఏర్పడటంతో మురికి నీరు సరఫరా అవుతుంది. లీకేజీ నీరంతా రోడ్డుపై పారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మైలారం గ్రామంలో గల ప్రధాన దారిపై గత మూడు నెలలుగా పైపులైన్ లీకేజీ కావడంతో నీరంతా రోడ్డుపై పారుతుంది. ఈక్రమంలో స్థానిక ప్రజలకు మురికినీరు సరఫరా అవుతున్నాయి. సంబందిత అధికారులకు సమస్యను విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసనతో కూడిన మురికి నీరు రావడంతో తాగడానికే కాకుండా వాడకానికి కూడా పనికి రావడం లేదని వాపోతున్నారు. నాచుపల్లి గ్రామంలో పైప్‌లైన్ లీకేజీలతో నీరంతా రోడ్డుపై వృథాగా పారుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పైప్‌లైన్ల లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని, స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మురికినీరు వస్తున్నాయి..



మా గల్లీలో దుర్వాసనతో కూడిన మురికినీరు వస్తున్నాయి. బకెట్‌లో పోస్తే డ్రెయినేజీ నీళ్లలాగే కనిపిస్తున్నాయి. నిత్యం తాగు నీరు, వాడకం నీరు లేక ఇబ్బందిగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచి నీటిని పంపిణీ చేయాలి. – గైని రాములు, నాచుపల్లి

సమాచారం..

నేడు కరెంట్ కోత

భిక్కనూరు: దోమకొండలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం భిక్కనూరు మండలలోని లక్ష్మీదేవునిపల్లి, గురుజకుంట, తిప్పాపూర్ గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉందనున్నట్లు ట్రాన్స్‌కో డివిజనల్ ఇంజినీర్ కల్యాణ చక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కరెంట్ కోత ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రవేశ పరీక్షలకు ఉచిత కోచింగ్

దోమకొండ: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైందని విద్యార్థులకు ఉచిత కోచింగ్ గడికోట ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తామని మేనేజర్ బాబ్జీ ఒక ప్రకటనలో తెలిపారు. దోమకొండతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థినీవిద్యార్థులు ఉచిత తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తరగతులను సాయంత్రం 4:30 నుంచి 5:30 వరకు నిర్వహిస్తామని, ఆదివారం ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో పార్ట్‌టైం ప్రాతిపదికన ఉపాధ్యాయులుగా పనిచేయుటకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. టీజీటీ ఇంగ్లీష్ సబ్జెక్టు బోధించుటకు బీఈడీ, పీజీ కోర్సులు చేసి, బోధనలో అనుభవం ఉన్న మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. డెమో ప్రాతిపదికన ఉపాధ్యాయులను ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తిగల మహిళా అభ్యర్థులు ఈనెల 30న ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

ఆధ్యాత్మికం

రాజరాజేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని మైలారం గ్రామంలోగల రాజరాజేశ్వర ఆలయంలో శనివారం త్రయోదశిని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు చేశారు. సోమవారం అమావాస్య కారణంగా రావిచెట్టు పూజ, అభిషేకాలు చేయనున్నట్లు తెలిపారు.

రేపు సోమావతి అమావాస్య వ్రతం

కామారెడ్డి అర్బన్: పట్టణంలోని వివేకానంద కాలనీలోగల సీతారామాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం ఉదయం సోమావతి అమావాస్య వ్రతోద్యాపన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు కొండా అశోక్, నాగెల్లి శ్రీనివాస్, తమ్మి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం అన్నప్రసాదం ఉంటుందని భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు భగవద్గీత సత్సంగ్

కామారెడ్డి అర్బన్: పట్టణంలోని మెడికల్ అసోసియేషన్ భవనంలో ఆదివారం ఇస్కాన్ కేంద్రం ఆధ్వర్యంలో భగవద్గీత ప్రవచనలు సత్సంగ్ ఉంటుందని ప్రతినిధి వెంకటదాస్ ప్రభు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకృష్ణ పూజలు, భజనలు, కీర్తనలు, భగవద్గీత ప్రవచనం, అన్నప్రసాదం ఉంటుదని భక్తులు పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



బాన్సువాడ రూరల్: మండలంలోని కొయ్యగుట్టలో గల జగదాంబ, సేవాలాల్ ఆలయ 4వ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు భక్తిశ్రద్ధలతో భోగ్ బండార్ నిర్వాహించారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయం వద్ద అన్నదానం చేపట్టారు. కొయ్యగుట్ట తండా వాసులు, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి



చుక్కాపూర్‌లో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులను సన్మానిస్తున్న నాయకులు

మాచారెడ్డి: పార్టీని బూత్ స్థాయిలో బలోపేతం చేయాలని బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ కుంటా లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని లక్ష్మీరావులపల్లి, చుక్కాపూర్, ఎల్లంపేట గ్రామాల్లో బూత్ కమిటీల అధ్యక్షులను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడారు. పార్టీని బలోపేతం చేయడానికి బూత్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నాయకులు పొన్నాల వెంకటరెడ్డి, బూస సురేష్, కాంపెల్లి రాజిరెడ్డి, బాల్‌చంద్రం, హారిక ఉన్నారు.

బీబీపేట మండలంలో..

బీబీపేట: మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో శనివారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సంస్థాగత మార్పుల్లో భాగంగా 61 బూత్ అధ్యక్షుడిగా బీరయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కుంటా లక్ష్మారెడ్డి, మండల అధ్యక్షుడు బట్టుపల్లి రంజిత్‌గౌడ్, సంతోష్, పోసు శివ, నక్క రవీందర్, దేవరాజు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు అమ్ముకునే కుట్ర



కామారెడ్డి టౌన్: రాష్ట్రవ్యాప్తంగా ఆయా ప్రభుత్వ శాఖల్లో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను అమ్ముకునే కుట్ర జరుగుతుందని తెలంగాణ నిరుద్యోగ రక్షణ జేఏసీ అధ్యక్షుడు మహిపాల్ యాదవ్ ఆరోపించారు. జిల్లాకేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు అధికారులు, రాజకీయ పలుకుబడి ఉపయోగించుకుని మెరిట్, రిజర్వేషన్లతో సంబంధం లేకుండా ఒక్కొక్క పోస్టుకు రూ. లక్షలు తీసుకుంటూ ఉద్యోగాలను అమ్ముకుంటున్నారని ఆరోపించారు. తనకు బెదిరింపు కాల్స్ వచ్చాయన్నారు. త్వరలో ఆధారాలన్ని సేకరించి రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర చేపట్టే ఆలోచనలో ఉన్నట్టు పేర్కొన్నారు. నిరుద్యోగులు ఇకనైనా మేల్కొనాలని, ఈ అన్యాయాన్ని ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

సంక్షిప్తం

బాధిత కుటుంబానికి పరామర్శ



దోమకొండ: మండల కేంద్రానికి చెందిన యువజన కాంగ్రెస్ ఉ పాధ్యక్షుడు సీతారాం ప్రసాద్ శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని శనివారం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి మహమ్మద్ ఇలియాస్ పరామర్శించారు. రాష్ట్ర కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయశాఖ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, తీగల తిరుమలగౌడ్, గాల్‌రెడ్డి, బల్యాల సుదర్శన్, అనంతరెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల రికవరీ

మాచారెడ్డి: మండలంలోని పలువురు గతంలో సెల్‌ఫోన్లను పోగొట్టుకోగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు సీఈఐఆర్ ద్వారా ఫోన్లను రికవరీ చేసి చేశారు. వాటిని శనివారం బాధితులు ఘన్‌పూర్‌కు చెందిన రాములు, మాచారెడ్డికి చెందిన సుధాకర్, మల్లికార్జున్లకు పోలీసులు అప్పగించారు.

రక్తదాన శిబిరం

మాచారెడ్డి: మండలకేంద్రంలో శనివారం కామారెడ్డి జనరల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి మాచారెడ్డి ఎస్సై అనిల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రక్తదానం మహా దానమని అన్నారు. రక్తదానం చేసిన 35మంది యువకులను అభినందించారు. అస్లామ్, రమేష్, బుచ్చిరెడ్డి తదితరులు ఉన్నారు.

13వ సారి రక్తదానం

కామారెడ్డి అర్బన్: రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణికి బీపాజిటివ్ రక్తం అత్యవసరం కావడంతో శనివారం స్థానిక వ్యాపారి ఎర్రం ఈశ్వర్ కామారెడ్డి రక్తదాతల సమూహం ద్వారా స్పందించి వెంటనే రక్తదానం చేశారు. ఎర్రం ఈశ్వర్ 13వ సారి రక్తదానం చేయడంపై రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలు, చైర్మన్ రాజన్న అభినందించారు.

యాచకులకు దుప్పట్ల పంపిణీ



బాన్సువాడ: పట్టణంలో శనివారం సామాజిక ఆశయ సాధన సేవా సంఘం ఆధ్వర్యంలో యాచకులకు దుప్పట్లను పంపిణీ చేశారు. సందుల గంగారం అంజిరెడ్డి, బంగారు మైశయ్య, సాయిలు, మన్నే చిన్న సాయిలు ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని అబ్దుల్లానగర్ శివారులోని పైడి ఎల్లారెడ్డి అతిథి గృహంలో ఆదివారం జరిగే ఆర్యవైశ్య బందుమిత్ర ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆర్యవైశ్యులు భారీ సంఖ్యలో తరలిరావాలని సంఘం మండల అధ్యక్షుడు గంగాశరన్, తాడ్వాయి గ్రామ అధ్యక్షుడు కిశోర్ కోరారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ఆర్యవైశ్య కులస్తులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జుక్కల్ ఎమ్మెల్యేను కలిసిన టర్కీ రాయబారి



నిజాంసాగర్(జుక్కల్): విదేశీ పర్యటనలో భాగంగా శనివారం హైదరాబాద్ నగరానికి వచ్చిన టర్కీ దేశ రాయబారి ఒర్హాన్ ఎల్మన్ ఒకన్ దంపతులు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు స్వగృహానికి వచ్చారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి భారీగా పెట్టుబడులు పెట్టాలని ఆయనను కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. త్వరలోనే ఆయన జుక్కల్ నియోజకవర్గాన్ని సందర్శించి పర్యాటక ప్రాంతాలను పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): సీఎంకప్‌కు సంబంధించి రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు గోపాల్‌పేట హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల పీడీ సభాత్‌క్రిష్ణ శనివారం తెలిపారు. విద్యార్థులు అర్చన, అభిలాష్ ఈ నెల 31నుంచి మహబూబ్‌నగర్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలలో వారు పాల్గొంటారని వివరించారు. విద్యార్థులను హెచ్‌ఎం వెంకట్రాంరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు..

పిట్లం(జుక్కల్): పిట్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు సుప్రీత, మహాలక్ష్మి రాష్ట్రస్థాయి సీఎం కప్ ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ సంజీవులు శనివారం తెలిపారు. క్రీడాకారులను హెచ్‌ఎం, ఎంఈవో దేవిసింగ్, ఉపాధ్యాయులు అభినందించారు.

నూతన దుకాణం ప్రారంభం

ఎల్లారెడ్డి: పట్టణంలో శనివారం రాజరాజేశ్వర ట్రేడర్స్‌ను మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ ప్రారంభించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి తదితరులున్నారు.

ఆర్చరీ క్రీడాకారులకు అభినందన

దోమకొండ: మండల కేంద్రంలోని గడికోటలో శనివారం రాష్ట్ర స్థాయిలో సిల్వర్ మెడల్స్ సాధించిన ఇద్దరు క్రీడాకారులను జిల్లా ఆర్చరీ సంఘం అధ్యక్షుడు తీగల తిరుమలగౌడ్ అభినందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరె మోహన్‌రెడ్డి, సలహాదారు పున్న లక్ష్మణ్, కోచ్ ప్రతాప్ దాస్ పాల్గొన్నారు.

అందుబాటులో సరిపడా ఎరువుల నిల్వలు



మాచారెడ్డి సింగిల్ విండోలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్



లింగంపేటలో నిల్వ ఉన్న ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు

మాచారెడ్డి: ఈ సీజన్‌కు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. మాచారెడ్డి సింగిల్‌విండో కార్యాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఎరువుల నిల్వల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మాచారెడ్డి సింగిల్ విండోతో ఎల్లంపేట, ఎలుపుగొండ, ఫరీద్‌పేట, భవానీపేట బ్రాంచ్‌లలో 1900 యూరియా, 240 బస్తాల కాంప్లెక్స్ బస్తాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని సిబ్బంది వివరించారు. డీఏవో మాట్లాడుతూ.. సిబ్బంది అందుబాటులో ఉంటూ ఎరువులను పంపిణీ చేస్తారని వివరించారు. ఏడీఏ అపర్ణ, మాచారెడ్డి వ్యవసాయాధికారి పవన్, ఏఈవో ప్రభాకర్, సింగిల్ విండో సిబ్బంది ఉన్నారు.

ఈ–పాస్ ద్వారా ఎరువుల విక్రయాలు

లింగంపేట(ఎల్లారెడ్డి): ఈ–పాస్ యంత్రాల ఆధారంగా ఎరువులు విక్రయిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్ తెలిపారు. లింగంపేట మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలు, ఐలాపూర్, మోతె, లింగంపేట, నల్లమడుగు సహకార సంఘాల గోదాముల్లో ఉన్న ఎరువుల నిల్వలను శనివారం ఆయన పరిశీలించారు. ఎరువుల సరఫరా, రైతులకు విక్రయించిన ఎరువుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎరువుల విక్రయ డీలర్లు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. సీఈవోలు పెంటయ్య, మహిపాల్‌రెడ్డి, ఆయా దుకాణాల డీలర్లు తదితరులు ఉన్నారు.

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో పోరాటం కొనసాగిస్తాం



అమరవీరుల స్థూపం వద్ద నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

కామారెడ్డి టౌన్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ స్ఫూర్తితో తమను ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల నిరవధిక సమ్మె శనివారం 19వ రోజుకు చేరింది. ఈసందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి హౌజింగ్ బోర్డు అమరవీరుల స్థూపం వరకు పాదయాత్ర చేపట్టారు. అనంతరం నిజాంసాగర్ చౌరస్తాలో తెలంగాణ అమరవీరుడు పోలీస్ కిష్టయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం ప్రధాన కార్యదర్శి సంపత్, మహిళా అధ్యక్షురాలు వాసంతి, నాయకులు శ్రీధర్, రాములు, శైలజ, సంతోష్ రెడ్డి, వనజ, మంగా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు టీపీ జేఏసీ మద్దతు..

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ పూర్తి మద్దతునిస్తున్నట్లు రాష్ట్ర ప్రతినిధులు జగన్నాథం, రమణ, నర్సింహారెడ్డి, వేణుగోపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వారి న్యాయమైన డిమాండ్‌లను పరిష్కారం చేయాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు పీఆర్టీయూ ఆధ్వర్యంలో పులిహోర ప్యాకెట్లను అందజేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అశోక్ తదితరులున్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి



కామారెడ్డిలో నివాళులు అర్పిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి



బాన్సువాడలో..

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలోని పలు మండలాల్లో శనివారం దివంగత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ చిత్రపటానికి స్థానిక అధికారులు, నాయకులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ.. ఆయన మరణం పార్టీకి, దేశ ప్రజలకు తీరని లోటు అని, ఆయన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఆయన చేసిన సంస్కరణలు, సేవలను కొనియాడారు.



మద్నూర్ బాలుర గురుకులంలో..



ఎల్లారెడ్డి డిగ్రీ కళాశాలలో..



తాడ్వాయి మండలపరిషత్ కార్యాలయంలో..

బాధిత కుటుంబానికి చేయూత



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన లక్ష్మీ కుటుంబాన్ని మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ శనివారం పరామర్శించారు. రూ.5వేల ఆర్థికసాయం అందించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి తదితరులున్నారు.

హక్కులు, చట్టాలను తెలుసుకోవాలి



బీబీపేట: విద్యార్థులు తమ హక్కులు, చట్టాలు ఖచ్చితంగా తెలుసుకోవాలని మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రామేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.